క్లుప్తంగా

ఆచార్యుడు నాగరాజు మృతికి సంతాపం



ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం ఆచార్యుడు జి.నాగరాజు ఆకస్మికంగా మృతి చెందారు. ఈ మేరకు గురువారం విభాగంలో ఆర్ట్స్ కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. నాగరాజ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మంచి మేధస్సు, నిబద్ధతతో పనిచేసే వ్యక్తిని కోల్పోయామన్నారు. విభాగాధిపతి డాక్టర్ ఎస్.పుల్లారావు మాట్లాడుతూ విభాగ బీవోఎస్ చైర్మన్‌గా, యూబీఏ సమన్వయకర్తగా, అసిస్టెంట్ ప్రిన్సిపాల్‌గా నాగరాజు ఎంతో సమర్థవంతంగా పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లిల్లీ గ్రేస్, డాక్టర్ ఆశాలత, పరిశోధకులు, విద్యార్థులు, విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్ తీరు పరిశీలన



తనిఖీ చేస్తున్న రాష్ట్ర టీబీ సంయుక్త సంచాలకుడు రమేష్

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వ టీబీ సంయుక్త సంచాలకుడు డాక్టర్ టి.రమేష్ గురువారం నగరంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లాలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యానగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో గ్రామిక వీధి సచివాలయం, కాగితాల వారి వీధి సచివాలయంలో వ్యాక్సిన్ కూలర్, ఐఎల్‌ఆర్‌ను పరీక్షించారు. ఆయన సమక్షంలో పలువురు మధుమేహ, టీబీ బాధితులకు వ్యాక్సిన్ వేశారు. అనంతరం లాసన్స్ బే కాలనీలో పర్యటించి ఆరోగ్య సిబ్బంది వ్యాక్సిన్ వేసే విధానం, తదితర అంశాలను గమనించారు. అర్హులందరికీ వ్యాక్సిన్ వేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఎంవీపీ కాలనీ సందర్శించి వ్యాక్సిన్ పంపిణీ జరుగుతున్న విధానాన్ని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిద్దె పంటల సాగును ప్రోత్సహిద్దాం

మురళీనగర్ : నగరంలో మిద్దె పంటలు సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని వనమాలి గ్రూపు అడ్మిన్ ఎ.అరుణకుమారి సూచించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో గురువారం సాయంత్రం వనితా వాకర్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్కనీల్లో మొక్కల పెంపకం విధానాలను వివరించారు. ఆర్గానిక్ కూరగాయల పెంపకానికి అవసరమైన కంపోస్టు ఎరువుల తయారీ విధానాన్ని తెలిపారు.

విజ్ఞాన నిధి



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు

- నిరుద్యోగులకు పెన్నిధి జిల్లా కేంద్ర గ్రంథాలయం
- అందుబాటులో వేల పుస్తకాలు



మతగ్రంథాలు, తత్వశాస్త్రముల ర్యాక్



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న చిన్నారులు



సాహితీ ప్రియుల కోసం తెలుగు నవలలు

దాబాగార్డెన్స్ : నిరుద్యోగులకు విజ్ఞానాన్ని అందిస్తోంది జిల్లా కేంద్ర గ్రంథాలయం. సుమారు 7 దశాబ్దాలుగా విద్యార్థులు, నిరుద్యోగులకు బాసటగా నిలుస్తోంది. ఆరేడు దశాబ్దాల కిందట కేజీహెచ్ అప్‌రోడ్డులో ఉండే జిల్లా కేంద్ర గ్రంథాలయం అనివార్య కారణాల వల్ల దశాబ్దం క్రితం జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో మెలోడి థియేటర్ వద్ద ప్రైవేట్ భవనంలోకి మార్చారు. ఎందరికో విజ్ఞానాన్ని అందిస్తూ ప్రగతిపథంలో దూసుకుపోతోంది.

అన్ని వర్గాల వారికి అందుబాటులో..

ఈ గ్రంథాలయం అన్ని వర్గాలకు అందుబాటులో ఉంది. విద్యార్థులు, నిరుద్యోగులు, చిన్నారులు, సాహితీప్రియులు, వృద్ధులు ఇలా అందర్నీ అలరిస్తూ విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తూనే ఉంది. పోటీ పరీక్షలకు వెళ్లే నిరుద్యోగులకు ఎంతో ఉపయోగంగా ఉంది. వీరి కోసం ప్రత్యేకంగా ఓ గది కేటాయించారు. పుస్తకాలు చదువుకునేందుకు ప్రత్యేకంగా టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. రోజుకు సుమారుగా 150 నుంచి 200 మంది ఈ గ్రంథాలయానికి వస్తుంటారు.

పాఠకులపై ప్రభావం చూపని డిజిటల్ యుగం

సెల్‌ఫోన్ యుగం వచ్చిన తరువాత ప్రపంచం ముంగిట నిలుస్తోంది. అయితే డిజిటల్ గ్రంథాలయాలు కూడా ఆన్‌లైన్‌లో ఉండడంతో ఈ ప్రభావం గ్రంథాలయాలపై పడుతుందేమోనని చాలా మంది పుస్తకప్రియులు ఆందోళన చెందారు. కానీ ఆ ప్రభావం గ్రంథాలయాలపై లేదని గ్రంథాలయాధికారి చెబుతున్నారు. పాఠకులు, పుస్తకప్రియుల సంఖ్య తగ్గడం లేదని చెబుతున్నారు.

పాఠకులను ఆకట్టుకునేందుకు..

పాఠకులను ఆకట్టుకునేందుకు గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజెప్పేందుకు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా వేసవి సెలవుల్లో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వేసవి సెలవుల్లో విద్యార్థులకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పలు సంస్థలు, రిసోర్స్ పర్సన్స్ ద్వారా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాహితీ కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు.

నిరుద్యోగులు, విద్యార్థులుకు తొలి ప్రాధాన్యం

నిరుద్యోగులు, విద్యార్థులకు తొలి ప్రాధాన్యతనిస్తున్నామని గ్రంథాలయ అధికారి తెలిపారు. వీరికి ఏ రకమైన పోటీ పరీక్షల పుస్తకాలు అవసరమో గమనించి వాటిని కొనుగోలు చేస్తున్నామన్నారు. అలాగే వీరికి ఏ పుస్తకం కావాలో వెంటనే ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన అందుబాటులో తీసుకువస్తామని చెప్పారు.

ఈ గ్రంథాలయానికి ప్రత్యేక స్థానం



జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ప్రత్యేక స్థానముంది. ఇక్కడికి వచ్చేవారికి ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాం. ప్రతి రోజూ ఈ గ్రంథాలయానికి వచ్చి పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. ఇది తనకెంతో సంతృప్తినిచ్చింది.

– ఎల్ రాజేంద్రవర్మ, అసిస్టెంట్ ఇన్‌చార్జి లైబ్రేరియన్

ఆరిలోవ నుంచి వస్తున్నా..



గత నాలుగేళ్ల నుంచి డీఎస్సీ, పోటీ పరీక్షల కోసం ప్రిపేరవుతున్నా. ఈ గ్రంథాలయానికి ప్రతి రోజూ ఆరిలోవ నుంచి వస్తున్నా. ఇక్కడ పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అనుకూలంగా ఉంది.

– ఎస్.కె.లక్ష్మి, ఆరిలోవ, విద్యార్థి

కానిస్టేబుల్‌కి ప్రిపేరవుతున్నా..



కానిస్టేబుల్ పోస్ట్ కోసం ప్రిపేరవుతున్నా. గత రెండేళ్లుగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలోనే ప్రిపేరవుతున్నా. పోతినమల్లయ్య పాలెం నుంచి ఇక్కడకు వస్తున్నా.

– పి శ్వేత, పోతినమల్లయ్యపాలెం

రెండేళ్లుగా..



రెండేళ్లుగా కానిస్టేబుల్ పోస్ట్ కోసం ప్రిపేరవుతున్నా. కానిస్టేబుల్‌తో పాటు ఆర్పీఎఫ్, పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నా. ఇక్కడ మంచి మెటీరియల్ ఉంది.

–ఎ సంతోష్‌కుమార్, నిరుద్యోగి, పూర్ణామార్కెట్

గ్రూప్స్‌కి సిద్ధమవుతున్నా..



ఏపీపీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, సివిల్స్‌కి ప్రిపేరవుతున్నా. మంచి పుస్తకాలు ఉన్నాయి. గ్రూప్స్‌కి ప్రిపేరయ్యేందుకు మంచి వాతావరణం.

–ఎస్.నాగేంద్రకుమార్, పూర్ణామార్కెట్

ఓల్డ్ డెయిరీ ఫారం బస్‌బే సిద్ధం



పాత డెయిరీఫారం వద్ద నిర్మించిన బస్‌బే

ఆరిలోవ: జాతీయ రహదారిపై పాత డెయిరీ ఫారం వద్ద చేపట్టిన బస్‌బే సిద్ధమైంది. ప్రయాణికుల సౌకర్యార్థం నగరంలో పలు చోట్ల జీవీఎంసీ ఆధునిక బస్‌బేలు నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాత డెయిరీఫారం వద్ద ఇటీవల తలపెట్టిన బస్‌బే నిర్మాణం పూర్తయింది. అయితే అధికారులు ఇంకా దీనిని ప్రారంభించకపోవడంతో ప్రస్తుతం బస్సులు ఇక్కడ ఆపడం లేదు. ఈ బస్‌బేని త్వరగా వినియోగంలోకి తీసుకొచ్చి అన్ని బస్సులు నిలిపేలా ఆదేశాలు జారీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీంతో పాటు జూ పార్కు వద్ద చేపడుతున్న బస్‌బే నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యకర సమాజం



పర్యావరణ దినోత్సవ సభలో మాట్లాడుతున్న కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు



మాట్లాడుతున్న ఉమెన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్వాతి



పాల్గొన్న మహిళలు, విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని సచివాలయ ఉమెన్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు స్వాతి, హిమవర్షిణి, స్రవంతి, వార్డ్ హెల్త్ సెక్రటరీ సత్యవతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఎన్జీవో ఆధ్వర్యంలో గురువారం 19వ వార్డు పెదజాలరిపేటలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం, కాలుష్యరహిత సమాజం అందించాలంటే ప్రస్తుతం ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ దిశగా ప్రభుత్వాలు చేస్తున్న కృషికి అండగా నిలవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ ఎకో వైజాగ్‌లో భాగంగా జీవీఎంసీ నగరంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. తడి, పొడి చెత్తలను సేకరిస్తూ నగరంలో కాలుష్య నివారణకు సేవలందిస్తుందన్నారు. దీనికి ప్రజలందరి సహకారం కావాలన్నారు. మొక్కల సంరక్షణతో పాటు పెద్ద ఎత్తున వనాలు పెంచడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆర్పీ లక్ష్మి, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్రతినిధులు సురేంద్ర, పైడమ్మ, పైడి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ 2024 సంవత్సరానికి భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు తట్టుకోవడం అనే థీమ్‌తో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలో కళాశాల జాతీయ సేవా పథకం అధికారులు వివరించారు.

శరవేగంగా కల్యాణ మండపం నిర్మాణం



బాలాజీనగర్‌లో నిర్మాణ దశలో ఉన్న జీవీఎంసీ కల్యాణ మండపం

ఆరిలోవ: ఆరిలోవలో జీవీఎంసీ చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 11వ వార్డు బాలాజీనగర్‌లో సుమారు రూ.8 కోట్ల నిధులతో జీవీఎంసీ ఆధునిక కల్యాణ మండపం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. నాలుగు అంతస్తుల నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం మూడో ఫ్లోర్ కోసం పనులు చేపడుతున్నారు. ఈ కల్యాణ మండపం నిర్మాణం పూర్తయితే ఆరిలోవ కాలనీ నుంచి టీబీసీ పాయింట్, బాలాజీనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటోంది. అధికారులు స్పందించి త్వరగా ఈ భవన నిర్మాణం పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

భైరవస్వామికి అభిషేకాలు



భైరవస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: అమావాస్య సందర్భంగా భైరవస్వామికి గురువారం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భైరవస్వామిని దర్శించుకున్నారు. విభూదితో అభిషేకం నిర్వహించారు.

మహిళపై దాడి కేసులో ఒకరికి జైలు

సబ్బవరం: మహిళపై దాడి చేసిన కేసులో మండలంలోని పైడివాడ అగ్రహారానికి చెందిన ఓ వ్యక్తికి అనకాపల్లి కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధించినట్టు సబ్బవరం సీఐ పిన్నింటి రమణ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన పెచ్చేటి దుర్గారావు, గుండాల సంతోషి పక్కపక్క ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సంతోషి తమ ఇంటి వద్ద గతంలో రిగ్గు బోరు తీయిస్తుండగా బోరు నుంచి వస్తున్న బురుద దుర్గారావు ఇంటిపై పడింది. దీంతో వివాదం చెలరేగింది. పెచ్చేటి దుర్గారావు.. సిద్ధయ్య భార్య సంతోషిని రాయితో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. 2022 మార్చి 12న సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అనకాపల్లిలోని 12వ ఏఎంఎం కోర్టు 324 ఐపీసీ సెక్షన్ ప్రకారం ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానాతో పాటు 509 ఐపీసీ సెక్షన్ కింద అదనంగా మరో సంవత్సరం జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై ఉంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

లలిత పీఠంలో ప్రత్యంగిరా హోమం



లలితపీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట : స్థానిక లలితపీఠంలో అమావాస్య సందర్భంగా గురువారం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేదమంత్రాల మధ్య హోమం శాస్త్రోక్తంగా జరిపారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితపీఠంలో ప్రతీ నెల అమావాస్య రోజున ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శత్రు నాశనం, ఆర్థిక ఇబ్బందులు తొలగేందుకు, కోర్టు కేసుల్లో విజయం, ఉద్యోగ అభివృద్ధి విషయంలో శుభ ఫలితాల కోసం ఆది పరాశక్తి ప్రత్యంగిరాదేవి అనుగ్రహం పొందేందుకు హోమం నిర్వహించినట్టు తెలిపారు. హోమంలో పాల్గొన్న వారికి సర్వదుష్ట గ్రహ బాధలు, శత్రు ప్రయోగ బాధలు, ఆర్థిక, అనారోగ్య, కుటుంబ బాధలు తొలగిపోయి, కోరికలు తీరుతాయన్నారు. అలాగే ఉదయం పీఠంలో శనీశ్వరుని జయంతి సందర్భంగా శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలపై చర్చ

దాబాగార్డెన్స్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలు తక్షణం పరిష్కరించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిటూ) విశాఖ జిల్లా నాయకులు గురువారం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌తో చర్చించారు. చర్చలు అనంతరం ప్రధాన వైద్యాధికారి సిటూ నాయకులతో మాట్లాడుతూ ముఖ్యంగా సేఫ్టీ పరికరాలు, రెయిన్‌కోట్లు, సబ్బులు, కొబ్బరినూనె, యూనిఫాం, మాస్కులు, గ్లౌజులు, గమ్ముబూట్లు ఇస్తామని, అలాగే చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా, సాధారణ మరణానికి రూ.2లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.7లక్షలు, అలాగే బకాయి హెల్త్ అలవెన్స్, కార్మికులకు ఐడీ కార్డులు జారీ చేస్తామన్నారని యూనియన్ నాయకులు తెలిపారు. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు చేస్తామని, డెత్, 60 ఏళ్ల దాటిన లాంగ్ ఆబ్సెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోమన్నారన్నారు. చర్చల్లో యూనియన్ అధ్యక్షుడు టి నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములపై విచారణ జరిపించాలి

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రలో అన్యాక్రాంతమైన వేలాది ఎకరాల అసైన్డ్ భూములపై హైకోర్టు సీనియర్ సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. జగదాంబ జంక్షన్ సమీపాన సిటూ కార్యాలయంలో గురువారం సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. భూముల అన్యాక్రాంతంపై గత తెలుగుదేశం ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని, 3,200 ఫిర్యాదులు అందాయని, తర్వాత అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందన్నారు. అప్పుడు 4300 ఫిర్యాదులు అందాయని, ప్రభుత్వాలు మారినా, సిట్‌లు ఏర్పాటు చేసినా సమగ్ర రిపోర్టులు ప్రకటించలేదన్నారు. దళితులకు దక్కాల్సిన వేలాది ఎకరాల భూములు మాత్రం సంపన్నులకు అన్యాక్రాంతమయ్యాయని చెప్పారు. వీటిలో గత ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు, రాజకీయ అగ్రనేతల పాత్ర ఉందని ఆరోపణలు వచ్చాయన్నారు. జీవో 596 అసైన్డ్ భూములు స్వాధీనం చేసుకున్న అక్రమార్కులను రక్షించేదిగానే ఉందన్నారు. ప్రజల అభీష్టానికి అనుగుణంగా స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపించాలని, సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్, నిర్వాసితులకు ఉద్యోగాలు, ఖాళీగా ఉన్న 5 వేల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. రైల్వేజోన్ నిర్మాణం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలు అమలు సాధించాలని కోరారు.